# ప్రజలకు బీఆర్ఎస్ మేని'ఫెస్ట్'



మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

- **ప్రతి డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర**
- **మరోసారి అధికారంలోకి బీఆర్ఎస్**
- **బీ ఫాం ఇచ్చిన సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు**
- **పశ్చిమలో 50వేల మెజార్టీతో గెలుస్తా..**
- **అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా**
- **చీఫ్ విప్, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్**


హనుమకొండ, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజలు నచ్చేలా.. మెచ్చేలా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో సీఎం కేసీఆర్ బీ ఫాం ఇచ్చారని, అందుకు సీఎం, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లూ తన గెలుపులో భాగస్వాములైన గులాబీ కుటుంబ సభ్యులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు అయినా అంబేద్కర్ విగ్రహాన్ని దళితవాడల్లో పెట్టలేకపోయారని, ప్రత్యేక తెలంగాణలో సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు భారీ విగ్రహం నెలకొల్పిన మానవతావాది కేసీఆర్ అన్నారు. కరోనా కష్టకాలంలో 46వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా ముందుకు వెళ్తున్నామన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాంటిదని పేర్కొన్నారు. మరోమారు ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఈ మేనిఫెస్టోలో పొందుపర్చారన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీని ఈ సారి కూడా ఆశీర్వదిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసరా పింఛన్‌ను రూ. 3016కు పెంచి ప్రతి సంవత్సరం రూ. 500ల చొప్పున పెంచుతూ రూ. 5016 చేస్తామన్నారు. ఎంతో మంది కరోనా బారిన పడి చనిపోవడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని, వాటిని గుర్తించిన సీఎం కేసీఆర్ బీమా పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇవ్వడమే కాకుండా వికలాంగుల పింఛన్‌ను రూ. 4016 నుంచి రూ. 6వేలకు పెంచుతామన్నారు. రైతుబంధును రూ. 16వేలకు పెంచనున్నట్లు చెప్పారు. అర్హులైన నిరుపేద పేద మహిళలకు ప్రతి నెలా రూ. 3వేల అందజేయనున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల మహిళలు మళ్లీ కట్టెల పొయ్యి వాడే పరిస్థితి వచ్చిందని, బీపీఎల్ కుటుంబాలు, జర్నలిస్టులకు రూ. 400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

**ప్రతి డివిజన్‌లో యాత్ర..**

నియోజకవర్గ పరిధిలో ప్రతి డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపడుతున్నట్లు చీఫ్ విప్ తెలిపారు. 59, 60 డివిజన్లో ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వస్తూ బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఒక నాయకుడు గడియారాలు, మరో నాయకుడు కుక్కర్లు పంచి మభ్య పెడుతున్నారని, ప్రజలు మాత్రం పని చేసే నాయకుడినే ఎన్నుకుంటారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10లక్షల నుంచి 15లక్షలకు పెంచామని, అసైన్డ్ భూములు గలవారికి పట్టాలు ఇస్తానని సీఎం చెప్పారని అన్నారు. వరంగల్‌లో ఐటీ టవర్ నిర్మాణానికి స్థలాన్ని సేకరించామని, రెండు వేల ఏళ్ల చరిత్ర ఉన్న అగ్గలయ్య గుట్టను అభివృద్ధి చేయడంతో ఎంతో మంది జైనులు వచ్చి సందర్శిస్తున్నారని తెలిపారు. త్వరలోనే కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం అవుతుందని, రూ. 30కోట్లతో భద్రకాళీ మాడ వీధులు నిర్మించామని చెప్పారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు దేవాలయ అభివృద్ధికి నయా పైసా ఇవ్వలేదని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 50వేల మెజార్టీతో గెలుస్తాననే ఆత్మ విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఈగ మల్లేశం పాల్గొన్నారు.

# 'పొన్నాల'కు కేసీఆర్ సాదర స్వాగతం

- **బీఆర్ఎస్‌లో చేరిన టీ-పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య**
- **స్వయంగా గులాబీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న అధినేత కేసీఆర్**
- **ఇద్దరు బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు సహా 16 మంది కాంగ్రెస్ ముఖ్యనేతలు బీఆర్ఎస్‌లోకి**
- **ఎన్నికల వేళ జనగామలో గులాబీ జోష్**



బహిరంగ సభావేదికపై మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య, వేదికపై సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, ఎమ్మెల్సీ సిరికొండ, ఎమ్మెల్యేలు తాటికొండ, ముత్తిరెడ్డి, అభ్యర్థి పల్లా

జనగామ, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : టీ-పీసీసీ తొలి అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సోమవారం జనగామ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్ నుంచి సీఎం కేసీఆర్ వెంట హెలికాప్టర్‌లో వచ్చిన పొన్నాలను సభా వేదికపై పక్కనే కూర్చోబెట్టుకొని తొలుత గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. జనగామ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మరో బీజేపీ కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు సీహెచ్ రాజమౌళి, జనగామ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, సీనియర్ నాయకులు, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇక్బాల్, నర్మెట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిటి అంజయ్య, జనగామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ మాజీద్, కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, నర్మెట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, వెల్దండ సర్పంచ్ నర్ర రమణారెడ్డి, జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎర్రమల్ల లక్ష్మణ్, చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్, చేర్యాల మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు, దానంపల్లి సర్పంచ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, చేర్యాల మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు కుర్రపాటి మధు, కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సల్తాన్ గోవింద్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సరాబు మధు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు సౌడ మహేశ్, జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రావుల రాజేశ్‌గౌడ్‌ను పొన్నాల లక్ష్మయ్యతోపాటు సీఎం కేసీఆర్ స్వయంగా గులాబీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

**జనగామ బీఆర్ఎస్‌లో కొత్త ఊపు..**

హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట హెలికాప్టర్‌లో వచ్చిన పొన్నాల జనగామ ప్రజా ఆశీర్వాద సభలో అధినేత సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఊపు వచ్చింది. ఆయనతోపాటు వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు సహా జనగామ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బీజేపీకి చెందిన మరో కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ కూడా గులాబీ తీర్థం పుచ్చుకోవడంతో కాంగ్రెస్, బీజేపీలో కలకలం రేపుతున్నది. కాంగ్రెస్‌లో 45 ఏళ్లసుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉన్న పొన్నాల టీ-పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా ఏఐసీసీ పెద్దల తీరుపై అసహనంతో పార్టీకి రాజీనామా చేసి తిరిగి ఆయన గతంలో ప్రాతినిధ్యం వహించిన జనగామ గడ్డపైనే గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్ఎస్‌లో చేరడం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. నవంబర్‌లో ఎన్నికలున్న తరుణంలో పొన్నాల సహా బీ జేపీ సీనియర్ నాయకులు చేరడంతో బీఆర్ఎస్ అభ్యర్థికి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అదనపు బలం చేకూరినట్లయింది.


అన్నపూర్ణేశ్వరి అలంకరణలో దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు

## అన్నపూర్ణేశ్వరీగా భద్రకాళి

### వైభవంగా రెండో రోజు శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, అక్టోబర్ 16 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం భద్రకాళీ అమ్మవారు అన్నపూర్ణేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారిని అన్నపూర్ణేశ్వరీ దేవిగా అలంకరించారు. ఉదయం మకర వాహనసేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ లక్ష్మీబాబు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## భద్రకాళీని దర్శించుకున్న దాస్యం, నన్నపునేని

### బీ-ఫామ్‌లతో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్, అక్టోబర్ 16 : భద్రకాళీ అమ్మవారిని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్-దంపతులు, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దర్శించుకున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్‌లు అందుకున్న వారు తొలుత భద్రకాళీ అమ్మవారి చెంతన వాటిని పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. మహామండపంలో ఆశీర్వదించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

**తూర్పు కార్యకర్తల అపూర్వ స్వాగతం**

తూర్పు నియోజకవర్గం నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కించుకుని బీ-ఫామ్‌తో తొలిసారిగా వరంగల్‌కు విచ్చేసిన ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భద్రకాళీ ఆలయానికి విచ్చేసిన కార్యకర్తలు జై కేసీఆర్, జై నన్నపునేని నరేందరన్న నినాదాలతో హోరెత్తించారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కార్యకర్తలు క్యాంపు కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.




## బీ-ఫామ్‌లు అందుకున్న ఎమ్మెల్యేలు అరూరి, చల్లా

వర్ధన్నపేట/పరకాల, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ పార్టీ శాసనసభ అభ్యర్థులుగా ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి సోమవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫామ్ అందుకున్నారు. మూడో సారి బీఆర్ఎస్ అభ్యర్థిగా అరూరి రమేశ్ వర్ధన్నపేట నుంచి పోటీ చేయనున్నారు. రెండుసార్లు భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే రమేశ్ మూడో సారి కూడా భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే, పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీ ఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పరకాల అభ్యర్థిగా ప్రకటించి, తనకు బీ ఫామ్ అందించిన సీఎం కేసీఆర్‌కు, సహకరించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.